Andhra Jyothy Dt 02/08/23



# కోటి జనాభాకు సరిపడేలా 'మెట్రో' 13

- ప్రభుత్వ ఖర్చుతోనే పనులు ప్రారంభిస్తాం
- 5-10 ఎకరాల్లో ఔటర్ వాహనాల పార్కింగ్
- శివార్లలోనే నిలిపి, నగరంలోకి వచ్చేలా..
- మన మెట్రో నిర్మాణ ఖర్చు కి.మీ.కి 250 కోట్లే
- మిగతా నగరాల్లో ఖర్చు వెయ్యి కోట్ల దాకా
- మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడి

# కోటి జనాభాకు సరిపడేలా 'మెట్రో'

- మూడో దశ ఖర్చు రూ.60 వేల కోట్లు
- మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కోటి మంది జనాభాకు ఉపయోగపడేలా మెట్రో రైలు సేవలను విస్తరిస్తున్నట్లు హైదరాబాద్ మెట్రోరైల్ ప్రాజెక్ట్ లిమిటెడ్(హెచ్ఎంఆర్ఎల్) ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. సోమవారం నాటి రాష్ట్ర క్యాబినెట్ భేటీలో మెట్రో రైలు రెండు, మూడు దశల విస్తరణపై తీసుకున్న నిర్ణయాలను ఆయన మంగళవారం విలేకరులకు వివరించారు.



278 కిలోమీటర్ల పొడవుండే మూడోదశ ఖర్చు రూ.60 వేలుగా.. రెండోదశలో నాగోల్-ఎల్బీనగర్(5కి.మీ), బీహెచ్ఈఎల్-లక్డీకాపూల్(26కి.మీ) పనుల ఖర్చును రూ.9,100 కోట్లుగా అంచనాకట్టామని పేర్కొన్నారు. "రెండు, మూడు దశల పనులను తెలంగాణ ప్రభుత్వం ఖర్చుతోనే ప్రారంభిస్తాం. ఇప్పటికే రూ.5,660 కోట్లతో చేపట్టిన ఎయిర్‌పోర్ట్ మెట్రో కారిడార్‌ను కూడా పీపీపీ మోడల్‌లో కాకుండా, ప్రభుత్వమే నిర్మిస్తోంది. 2, 3 దశల్లో ఆసక్తి కలిగిన పెట్టుబడుదారులు వస్తే.. వారి సహకారం తీసుకుంటాం" అని వ్యాఖ్యానించారు. 2007లో మెట్రోరైలు ప్రాజెక్టును చేపట్టినప్పుడే.. ఔటర్ చుట్టూ మెట్రో ఏర్పాటు ప్రతిపాదనలు చేసినట్లు పేర్కొన్నారు. అప్పటి సర్కారు దానికి అంగీకరించలేదని, సీఎం కేసీఆర్ మాత్రం నగరంపై ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఆసక్తి చూపుతున్నారని వెల్లడించారు. మూడోదశ మెట్రో కారిడార్లు అందుబాటులోకి వస్తే.. మహబూబ్‌నగర్, విజయవాడ, వరంగల్, కరీంనగర్, సాగర్ రోడ్ మీదుగా నగరానికి వచ్చే వారికి సమయాభారం, ఖర్చు తగ్గుతుందన్నారు. ఈ ప్రాంతాల నుంచి వచ్చేవారు.. తమ వాహనాలను ఔటర్‌కు ఆవలే పార్క్ చేసుకునేలా 5-10 ఎకరాల్లో పార్కింగ్ లాట్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు అక్కడి నుంచి 20-25 నిమిషాల్లో నగరాన్ని చేరవచ్చని వివరించారు. ఇందుకు సంబంధించి మంత్రి కేటీఆర్ కూడా ఓ ట్వీట్ చేశారు. 20 ప్రాంతాల్లో మల్టీలెవల్ పార్కింగ్ సముదాయాల ఏర్పాటుకు తగిన స్థలాలను గుర్తించామని, ఒకచోట పార్కింగ్ లాట్ నిర్మాణాన్ని ప్రారంభిస్తామన్నారు. నగరంలో పార్కింగ్ సమస్య ఉన్న విషయం వాస్తవమేనని, దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఈ సమస్య ఉందని పేర్కొన్నారు. బీహెచ్ఈఎల్ నుంచి చందానగర్, మైత్రీనగర్, కొండాపూర్, కొత్తగూడ, గచ్చిబౌలి, టోలిచౌకి, రేతిఫైల్, మెహిదీపట్నం మీదుగా లక్డీకాపూల్ వరకు 26 కి.మీ మార్గంలో పనుల ప్రారంభానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎన్వీఎస్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మార్గంతోపాటు.. 5.5 కి.మీ దూరం ఉండే నాగోల్-ఎల్బీనగర్ రూట్‌ను పూర్తి చేసేందుకు అనుమతినివ్వడంతోపాటు తగిన సహకారం అందించాలని ఐటీశాఖ మంత్రి కేటీఆర్ నేతృత్వంలో ఇటీవల కేంద్ర మంత్రి హర్‌దీప్‌సింగ్‌పురిని కలిసి తాము విజ్ఞప్తి చేశామని ఎన్వీఎస్ రెడ్డి వివరించారు. ఈ రెండు రూట్లకు రీ ఎస్టిమేషన్ చేసి ఇవ్వాలని ఆయన సూచించగా ఆ దిశలో చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## కిలోమీటరుకు రూ.250 కోట్లే

పెరిగిన ముడిసరుకుల నేపథ్యంలో ప్రభుత్వం రూ.69,100 కోట్లతో ప్రతిపాదిత పనులన్నింటిని పూర్తి చేయడం సాధ్యమవుతుందా.. అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఎన్వీఎస్ రెడ్డి సమాధానమిచ్చారు. "ముంబైలో అండర్ గ్రౌండ్ మెట్రో నిర్మాణానికి కిలోమీటరుకు రూ.1000 కోట్లు ఖర్చయింది. చెన్నై, బెంగళూరు అండర్‌గ్రౌండ్‌కు రూ.600-800 కోట్లు వెచ్చించారు. నగరంలో చేపట్టనున్న మెట్రోకు ప్రస్తుత రేట్ల ప్రకారం ప్రతి కిలోమీటరు రూ.250-260 కోట్లు ఖర్చవుతోంది." అని ఆయన చెప్పారు.